# కాకి బతుకు

## - కొండా రామారావు



"నా పెళ్లాం అదృష్టం ఏమోగానీ ఇయ్యాల నాకు నాలుగు కాకులు దొరికినియ్‌రా!" అన్నాడు కొండన్న, తన జోలెని తడుముకుంటూ.

"నిజమే మావా.. రోజూ రెండే దొరికేవిగా" అన్నాడు బుజ్జిగాడు.

"మావా.. మా అత్త కాకి కూర చానాబాగా వండుద్దటగా, నిజమేనా?" అని అడిగాడు నాగులు ఆత్రంగా.

"నిజమేరా! బెమ్మాండంగా వండుద్ది.." అన్నాడు కొండన్న.

వాళ్లు ముగ్గురికీ కాకులు పట్టడమే జీవన భృతి. అంతకుమించి వాళ్లకి ఇంకే పనీ చేతకాదు. కష్టపడి నాలుగురాళ్లు సంపాదించాలనే ఆసక్తి వాళ్లకి లేదు. అలవాటైన పనికి కడుపు నింపుకోడానికి ఏదో కాస్త కూడు దొరికింది, అదే చాలు అనుకునే సగటు జీవులు వాళ్లు.

ఆ ముగ్గురికీ వయసు తారతమ్యం వుంది. కానీ స్నేహంగా వుంటూ, కాకుల వేటకి అడవికి కలిసే వెళతారు.

పదినన్ని కాకుల్ని కొట్టితెచ్చి, తమ గూడెంలో అమ్ముకుంటారు.

ఎవరూ కొనకపోతే వాళ్లే వాటిని వండుకు తింటారు. ఆ విధంగా ఆ రోజుకి వాళ్లకి పొట్ట నిండుతుంది. 'ఎందుకొచ్చిందిరా కాకి బతుకు' అనుకోడానికి లేదు. వాళ్లకి తెలిసిన దారి అదే మరి. కాకుల మీద ఆధారపడి బతికేస్తూ, కాకి బతుకు బతికేస్తున్నారు.

వాళ్లు ముగ్గురూ ఆ మాటా, ఈ మాటా మాట్లాడుకుంటూ అడవి విడిచిపెట్టి ఊర్లోకొచ్చి పడ్డారు. రోజులాగానే వాళ్లు టీ స్టాలు దగ్గరికొచ్చారు. టీ కుర్రాడికి సైగ చేసి, 'మూడు టీలు' అన్నట్టుగా మూడు వేళ్లు చూపించాడు కొండన్న. ఆ పక్కనే బెంచీ మీద కూర్చున్న ఒక స్టూడెంటు కుర్రాడు పేపరు చదువుతున్నాడు. వార్తల మీద ఆసక్తి వున్న కొంతమంది కూర్చుని శ్రద్ధగా వింటున్నారు. వీళ్లు ముగ్గురూ కూడా ఓ పక్కగా కూర్చున్నారు. స్టూడెంటు కుర్రాడు పేపర్లో వార్తల్ని పైకే చదువుతున్నాడు.

"నిన్నటి అర్ధరాత్రి సమయంలో గుజరాత్‌లో సంభవించిన భూకంపం కనీ వినీ ఎరుగనిది. కొన్ని వేలమంది మరణించారు. కొన్ని వేలమంది నిరాశ్రయులయ్యారు. వందలకొద్దీ ఇళ్లు నేలమట్టమయ్యాయి. వేల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లింది.." అంటూ చదవడం ఆపాడా కుర్రాడు.

ఎవరికి వాళ్లే జాలి చూపులతో తలోమాటా అంటున్నారు. వాళ్ల మాటలు వింటూ మౌనంగా వున్నాడా కుర్రాడు. "చదువు బాబూ.. ఇంకేంటి వార్తలు.." అన్నాడో పెద్దాయన. స్టూడెంటు కుర్రాడు మళ్లీ చదవసాగాడు.

"భూకంపం రాకడ మనుషుల కంటే నాలుగు గంటల ముందే పశు పక్ష్యాదులు తెలుసుకున్నాయి. వింత వింత శబ్దాలు చేస్తూ చిత్రంగా ప్రవర్తించాయి. కుక్కలు ఆకాశం వైపు చూసి మొరిగాయి. మనుషుల చుట్టూ తిరుగుతూ, వాళ్లకేదో సంకేతం అందించాలని ప్రయత్నించాయి. కాకులు గోల గోలగా అరుస్తూ వింత వింతగా ప్రవర్తిస్తూ ఏదో ఉపద్రవం ముంచుకు రాబోతోంది, జాగ్రత్త అని ఒకదానికొకటి హెచ్చరికలు చేసుకున్నాయి" అని అతను చదువుతుంటే అందరూ శ్రద్ధగా వింటున్నారు.

"కాకులు కూడా ముందుగానే తెలుసుకున్నాయా?" అని కొండన్న పేపరు చదివే అబ్బాయిని అడిగాడు.

"కాకులే ముందు తెలుసుకున్నాయి" అని స్టూడెంటు కుర్రాడు సమాధానం చెప్పాడు కొండన్నకి.

"కాకి గోల, కాకి బతుకు అంటూ మనం నిత్యం కాకుల్ని చిన్నచూపు చూస్తానే వుంటాం. కానీ అవి మనకంటే గొప్పవి. మనకి ముంచుకొచ్చే ప్రమాదాన్ని ముందుగానే హెచ్చరికలు చేసినా గానీ, మనం తెలుసుకోలేకపోయాం" అంతవరకూ మౌనంగా వున్న ఆ పెద్దాయన అన్నాడు.

ఆ మాటలు కొండన్న మీద ప్రభావం చూపించాడు. ఏమనుకున్నాడో ఏమో, లేచి నిలబడ్డాడు. తన జోలెలోని కాకుల్ని బయటికి తీసి, వాటిని గాలిలోకి ఎగరేశాడు.

ఒక్కసారిగా స్వేచ్ఛ లభించేసరికి కాకులు "కావ్...కావ్..." మంటూ గోల గోలగా అరుచుకుంటూ తోచిన దిక్కుకి ఎగిరిపోయాయి.

"రేపటినుంచి కాకుల్ని కొట్టి, వాటి బతుకుల్లో నిప్పులు పోయనుగాక పోయను" అని అందరి ముందూ చెప్పాడు కొండన్న. బుజ్జిగాడు, నాగులు కూడా అతని దారినే నడుస్తామన్నారు.

స్వేచ్ఛగా ఎగిరిపోతున్న కాకుల వైపే అందరూ ఆశ్చర్యంగా చూడసాగారు. వాళ్లలో తాపీ మేస్త్రి మాల్యాద్రి కూడా వున్నాడు. కొండన్న తీసుకున్న అంత మంచి నిర్ణయానికి అతను మరింత ఆశ్చర్యపోయాడు.

"రేయ్ కొండన్నా! రేపటినుంచి మీరు ముగ్గురూ వాడగ్గరికి పనికి రండ్రా!" అన్నాడు.

ఆ ముగ్గురూ సంతోషంగా "అట్టాగే వస్తాం మేస్త్రీ!" అన్నారు ఏక కంఠంతో.

★